




# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 14-08-2024 సంపుటి : 06 సంచిక : 326 పేజీలు : 8 వెల : రూ 3-00

# విశాఖ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ముగిసిన నామినేషన్ల గడువు..

## పోటీలో ఇద్దరే అభ్యర్థులు




అమరావతి : ఈనెల 30న జరుగనున్న విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నామినేషన్ల గడువు మంగళవారం ముగిసింది. పోటీ నుంచి కూటమి ప్రభుత్వం తప్పుకోవడంతో రంగంలో ఇద్దరే నిలిచారు. వైసీపీ అభ్యర్థిగా, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణస్వతంత్ర అభ్యర్థిగా షఫీ ఉల్లా నామినేషన్ దాఖలు చేశారు. రేపు నామినేషన్ల పరిశీలన జరుగనుంది.రెండు నెలల క్రితం ఏపీలో జరిగిన సార్వత్రిక ఎన్నికకు ముందు వైసీపీ ఎమ్మెల్సీ శ్రీనివాస్ రాజీనామా చేసి జనసేనలో చేరారు. అయితే పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ వైసీపీ అధిష్టానం అప్పటి మండలి చైర్మన్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. వాటిని పలు ధపాలుగా పరిశీలించిన మండలి చైర్మన్ చివరకు ఎమ్మెల్సీపై అనర్హత వేటు వేశారు. దీంతో ఖాళీ అయిన విశాఖ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసి ఎన్నికలను నిర్వహిస్తుంది.

ఈ ఎన్నికల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో వైసీపీ 600 మంది ఎంపీటీసీ, జడ్పీటీసీలు కార్పొరేటర్ల సంఖ్యాబలం ఉంది. కూటమికి 200 పైగా మాత్రమే సభ్యులున్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని భావించిన కూటమి ప్రభుత్వం చివరకు హుందాగా రాజకీయాలు చేద్దామని, ఎవరిని ప్రలోభ పెట్ట వద్దని సూచిస్తూ ఎన్నికల్లో? పోటీ వద్దంటూ చంద్రబాబు స్పష్టం చేశారు.

# ఇస్రో శాస్త్రవేత్తలు మనిషి రూపంలో ఉన్న దేవుళ్లు

## : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



అమరావతి : భారతదేశానికి కీర్తి ప్రతిష్టలు తెస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలకు హ్యాట్సాఫ్, నా సెల్యూట్ అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌అన్నారు. వారు కంటికి కనిపించే దేవుళ్లని ప్రశంసించారు. నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో జరిగిన ప్రపంచ అంతరిక్ష ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికను అందిపుచ్చుకుని ఒకే రాకెట్ నుంచి వందకు పైగా ఉపగ్రహాలు విదేశాలకు సంబంధించిన ఉపగ్రహాలను సతీష్ ధావన్ కేంద్రం నుంచి పంపడం చంద్రునిపైకి పంపడం అభినందనీయమని అన్నారు.విజయవంతంగా ఉపగ్రహాలను పంపి ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఇస్రోకు రుణపడాలని, సైంటిస్టులు భారతదేశానికి నిజమైన హీరోలని కొనియాడారు. నాకు కూడా చిన్నప్పటి నుంచి శ్రీహరి కోటాకు రావాలని అనుకునేవాడని, అది ఇప్పుడు నెరవేరిందని అన్నారు. చదువుకునే రోజుల్లో అంతరిక్షం గురించి టీచర్లను అడిగేవాడినని గుర్తు చేస్తుకున్నారు.


# త్రివర్ణం – సగర్వం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 13- : దేశం మనదే.. తేజం మనదే.. ఎగురుతున్న జెండా మనదే.. దేశం తర్వాతే ఏదైనా అని, ప్రతి ఒక్కరూ జాతీయ భావానికి విలువ ఇవ్వాలని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖా మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం, పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. 100 అడుగుల జాతీయ జెండాతో నంద్యాల టెక్కే మార్కెట్ యార్డ్ నుండి గాంధీ చౌక్ సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీని రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్. జిల్లా కలెక్టర్ జి రాజకుమారి. జాయింట్ కలెక్టర్ విష్ణు ఛరణ ప్రారంభించారు . జాతీయ జెండా ప్రతి ఒక్క ఇంటిపై రెపరెప లాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో డీఆర్వో పద్మజ. జిల్లా అధికారులు మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకి రెడ్డి. విద్యా శాఖ అధికారులు. సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# వైసిపి నేతలకు కార్యకర్తలకు టిడిపి లోకి నో ఎంట్రీ....

## సీఎం చంద్ర బాబు ఆదేశం...



కందుకూరు టిడిపి అధికారంలోకి వచ్చిందని వాళ్ల సొంత లాభాల కోసం వైసిపిని వీడినట్లు షో చేస్తూ టిడిపిలోకి వచ్చే వారితో జాగ్రత్తగా ఉండాలని సీఎం ఆదేశించారు. చిన్న చిన్న నామినేటెడ్ పదవులు పాఠశాల మేనేజ్మెంట్ కమిటీల లాంటి వాటికోసం గానీ నీటిపారుదల సంఘాల అధ్యక్ష పదవుల కోసం గానీ ఇతరత్రా పదవులకోసం గానీ, లోగడ తప్పులు చేసి వాటినుండి తప్పించు కోవడానికి గానీ పార్టీలోకి చేరి మరల వారు ఈ పదవులు పొంది తిరిగి ఆ పార్టీ వారికి అనుకూలంగా ఉంటారని, అటువంటి వారి ఎత్తుగడలు చెల్లవని తేల్చి చెప్పారు. అటువంటి వారినిపార్టీలోకి చేర్చు కోవద్దని కార్యకర్తలను నాయకులను ఆదేశించారు.నిజాయితీగా పార్టీలో తిరిగే వారికే పదవులు గాని నాయకత్వం గానీ వస్తుందని రెండు పడవలపై కాలు వేసే వారిని దూరంగా ఉంచాలని,టిడిపిలో ఉంటూ వైసీపీ కోవర్ట్ లుగా పనిచేసే వారిని గుర్తించి వారిని దూరం పెట్టాలని ఆదేశించారు.ఇదిలా ఉండగా ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి కూటమి తరుపున పోటీ చేసిన ఎం.పి.అభ్యర్థి వేమిరెడ్డి. ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నాగేశ్వర రావును ఓడించేందుకు శాయశక్తులాఆ పనిచేసిన పలువురు వైకాపా నాయకులు, సర్పంచులు కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వర రావు టిడిపి లో చేర్చు కున్నారు. వాస్తవానికి నూతనంగా టిడిపి లో చేరిన వైకాపా నాయకులు, సర్పంచులు వల్ల టిడిపికి ఒరిగేది ఏమీ లేదు. కేవలం ఈ 5 సంవత్సరాల కాలం పాటు తమకు భద్రత ఉంటుందనే ఉద్దేశ్యంతో సదరు వైకాపా నాయకులు టిడిపి తీర్థం పుచ్చు కున్నారే తప్ప టిడిపి పై వారికి ఏమాత్రం అభిమానం, ప్రేమలేదని చంద్ర బాబు నాయుడు కోసం, పవన్ కళ్యాణ్ కోసం శ్రమించిన కూటమి నాయకులు, కార్యకర్తలు బాహాటంగా పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం ఇకనైనా వైకాపా నాయకులను,కార్య కర్తలను, ప్రజా ప్రతినిధులను టిడిపి లో చేర్చు కోకుండా ఉండేందుకు స్థానిక టిడిపి నాయకులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని కందుకూరు నియోజక వర్గ టిడిపి నేతలు,జనసేన నాయకులు, బి.జే.పి. నాయకులు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుకు, ఆయన తనయుడు రాష్ట్ర విద్యా శాఖా మంత్రి లోకేష్ బాబుకు మంగళవారం విజ్ఞప్తి చేశారు.

# జగన్ అధికారంలో ఉండి ఉంటే.. పథకాలన్నీ అందేవి : మాజీ ముఖ్యమంత్రి



అమరావతి : తాను అధికారంలోకి ఉండి ఉంటే పథకాలన్నీ ప్రజలకు అందేవని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. రైతులు సంతోషంగా ఉండేవారని , విద్యాదీవెన, వసతి దీవెన అంది పిల్లల తల్లుల్లో ఆనందం వెల్లివిరిసేదని పేర్కొన్నారు. విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మంగళవారం అనకాపల్లి, చోడవరం , మాడుగుల నియోజకవర్గాలకు చెందిన ఎంపీటీసీలు , జడ్పీటీసీ లతో తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ అధికారంలో ఉండి ఉంటే సకాలంలో షెడ్యూల్ ప్రకారం అన్ని వర్గాలకు పథకాలు అందేవని గుర్తు చేశారు. ప్రతి ఇంటికి మంచి చేశామని, చేసిన మంచి ఎక్కడికీ పోదని, వచ్చే ఎన్నికలు మనకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. వైసీపీ అధికారంలో లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు పేదలకు అందడం లేదని ఆరోపించారు.రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, రెడ్‌బుక్ పాలన నడుస్తోందని, కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరికైనా , ఏ పార్టీకైనా కష్టాలు ఎల్లకాలం ఉండవు. చీకటి తరువాత వెలుగు ఉంటుందని వెల్లడించారు. చంద్రబాబు ప్రజలకు ఆశ చూపి గెలిచారని, అధికారంలోకి వచ్చిన తరువాత బాబు నైజం బయటపడిందని ఎద్దేవా చేశారు.

# కాకినాడ పోర్టు అడ్డాగా అక్రమంగా బియ్యం తరలింపు

## తనిఖీల్లో 26వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని స్వాధీనం నోటీసులు ఇచ్చి బాధ్యులను అరెస్ట్ చేయిస్తాం ఎంతటి వారైనా వదలబోమన్న మంత్రి నాదెండ్ల



కాకినాడ,ఆగస్ట్13:పౌరసరఫరాల శాఖను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని ఎపి పౌరసరఫరాల శాఖ మంత్రి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. వైకాపా పాలనలోఓకుటుంబం కాకినాడ పోర్టును అడ్డాగా మార్చుకొని, రేషన్ బియ్యం అక్రమాలకుపాల్పడిందనిఆరోపించారు.కాకినాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్‌లో నిర్వహించిన తనిఖీల్లో 26వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. రేషన్ బియ్యంఅక్రమాల కేసులో విచారణ కొలిక్కి వచ్చిందని తెలిపారు. ఈ కేసులో ఎంతటివారున్నావదిలేప్రసక్తేలేదని,చట్టప్రకారంవారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాకినాడ పోర్టు ఏర్పాటు చేసింది ఓ కుటుంబం కోసం కాదు.. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ కోసం. ఈ ప్రాంతానికి పెట్టుబడులు రావాలన్న ఉద్దేశంతోనే పోర్టును ఏర్పాటు చేశారు. కానీ, గత ఐదేళ్లలో ఇక్కడికి ఇతరులెవరూ రాకుండా వైకాపా నేతలు హుకుం జారీ చేసి, అక్రమాలకు పాల్పడ్డారు. మీడియా ప్రతినిధులకు అనుమతి లేకుండా చేశారు. ఇక్కడి రేషన్ బియ్యాన్ని.. నూకలు, ఉప్పుడు బియ్యం పేరుతో రీ ప్యాకింగ్ చేసి విదేశాలకు ఎగుమతి చేశారు. అక్రమాలకు పాల్పడిన వారెవ్వరినీ వదలం.. చట్టప్రకారం కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకుంటాం. త్వరలోనే 41ఏ ద్వారా నోటీసులిచ్చి అరెస్టు చేస్తాం. కాకినాడ పోర్టులో పని చేస్తున్న ఉద్యోగులు, హమాలీల సమస్యలను పరిష్కరిస్తాం' అని నాదెండ్ల తెలిపారు. అక్రమ రేషన్ బియ్యం రవాణా కాకినాడ పోర్టు ద్వారా జరిగిందని ఈ వ్యవహారంలో త్వరలో అరెస్టులుంటాయని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఉభయ గోదావరి జిల్లాల పర్యటనలో భాగంగా మంగళవారం కాకినాడలో మంత్రి మనోహర్ పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పౌరఫరాలశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ విలేకరులతో మాట్లాడుతూ త్వరలోనే 41ఎ నిబంధన కింద నోటీసులు ఇచ్చి రేషన్ బియ్యం అక్రమ తరలింపు చేసిన వారిని అరెస్టు చేస్తామన్నారు. ఇప్పటికే 6ఎ కింద నోటీసులు ఇచ్చి క్రిమినల్ కేసులను నమోదు చేశామన్నారు.

# విశాఖ ఎమ్మెల్సీ ఉపఎన్నికకు టీడీపీ దూరం.. బొత్స గెలుపు లాంఛనమే



విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఉపఎన్నికకు టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి దూరంగా ఉండనుంది. ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించింది. విశాఖ జిల్లా నేతలతో చర్చించిన అనంతరం సీఎం చంద్రబాబు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఉపఎన్నికల్లో పోటీచేయాలా లేదా అనే విషయంపై కూటమి పార్టీలు తర్జనభర్జన పడ్డాయి. సరైన బలం లేకపోవడంతో చివరికి పోటీ నుంచి తప్పుకున్నాయి. ప్రస్తుతం వైసీపీ నుంచి మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, ఒక స్వతంత్ర అభ్యర్థి పోటీలో ఉన్నారు. మంగళవారంతో నామినేషన్ల గడువు ముగియనుంది. సోమవారం బొత్స తన నామినేషన్‌ను దాఖలు చేసిన విషయం తెలిసిందే.కాగా, ఇప్పటికే టీడీపీ పోటీ నుంచి తప్పుకున్నది. ఇండిపెండెంట్ అభ్యర్థి కూడా తన నామినేషన్‌ను ఉపసంహరించుకుంటే బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. అలాకాకుండా ఇండిపెండెంట్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకోకపోయినా ఆయన విజయం లాంఛనమే కానున్నది. ఎందుకంటే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో మొత్తం 840 ఓట్లు ఉన్నాయి. వాటిలో 11 ఖాళీలు ఉనాయి. ఇక మిగిలినవాటిలో విపక్ష వైసీపీకి 615 మంది ప్రజాప్రతినిధులు ఉండగా, టీడీపీకి 214 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు.

# సంపాదకీయం

బుధవారం 14-08-2024

## విశ్వ క్రీడల్లో వివాదాలు

పారిస్ ఒలింపిక్స్‌ను కొన్ని వివాదాలు చుట్టుముట్టాయి. లింగ అర్హత, డ్రగ్స్, యాంటీ సెక్స్ బెడ్‌లు, బాక్సింగ్ పాయింట్లు ఇలా ఎన్నో వివాదాలు విశ్వ క్రీడల్లో జరిగాయి. డ్రగ్స్ కొనేందుకు యత్నించిన ఆస్ట్రేలియ హాకీ జట్టు ఆటగాడు టామ్ క్రెయిగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. క్రెయిగ్‌ను విచారణ కోసం యాంటీ డ్రగ్ విభాగానికి అప్పగించినట్లు పారిస్ ప్రాసిక్యూటర్ కార్యాలయం వెల్లడించింది. ఈ ఘటనపై క్రెయిగ్ క్షమాపణలు చెప్పాడు. తాను ఘోరమైన తప్పు చేశానని... తన చర్యకు పూర్తి బాధ్యత వహిస్తానని తెలిపాడు. లైంగిక వేధింపుల ఆరోపణలపై ఈజిప్టుకు చెందిన 26 ఏళ్ల ఒలింపిక్ రెజ్లర్ మొహమ్మద్ ఇబ్రహీంను అరెస్టు చేసినట్లు ఫ్రెంచ్ ప్రాసిక్యూటర్లు తెలిపారు. మొహమ్మూద్ టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం గెలుచుకున్నాడు. పారిస్ కేఫ్ వెలుపల వెనుక నుంచి ఒక మహిళను పట్టుకున్నందుకు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పారిస్ ప్రాసిక్యూటర్లు తెలిపారు. స్వదేశానికి వెళ్లే కొద్ది గంటల ముందు మొహమ్మూద్ ఈ పని చేశాడుఒలింపిక్ విలేజ్ నుంచి అందంగా ఉందన్న కారణంతో పరాగ్వే స్విమ్మర్ లువానా అలోన్సోను పంపించేయడం కూడా వివాదం రేపింది. ఆమె అందం కారణంగానే బయటకు పంపిచారనే ప్రచారం జరిగింది. ఆమె అందంతో జట్టులోని ఇతర ఆటగాళ్లను తప్పుదోవ పట్టిస్తోందన్న కారణంతో అలోన్సోను స్వదేశానికి పంపించేశారు. ఆమె పరాగ్వే జట్టులో అనుచితమైన వాతావరణాన్ని సృష్టించిందని పరాగ్వే ఒలింపిక్ కమిటీ వెల్లడించింది. పారిస్ ఒలింపిక్స్‌లో ఓ అథ్లెట్‌కు ఊహించని విధంగా ఓటమి ఎదురైంది. పురుషుల పోల్ వాల్ట్ ఈవెంట్లో పురుషాంగం తగిలి... ఫ్రెంచ్ అథ్లెట్ ఆంథోనీ అమ్మిరాటికి పతకం చేజారింది. జంప్ చేస్తున్నప్పుడు జననాంగం పోల్‌కు తగిలడంతో అతను నాలుగో స్తానంలో నిలిచాడు. అయితే ఇదే ఇప్పుడు అంథోనీకి పోర్న్ సినిమాల్లో బోలెడు ఆఫర్లను తెచ్చిపెట్టింది. పోర్న్ సినిమాల్లో నటిస్తే 2, 50,000 డాలర్లు ఇస్తామని కూడా అంథోనీకి ఆఫర్ లెటర్ వచ్చింది. అయితే అతడు దానికి పెద్దగా ఇంట్రెస్ట్ చూపలేదు. ఈ ఒలింపిక్స్‌లో లింగ అర్హత వివాదం తీవ్ర కలకలం రేపింది. సాక్షాత్తూ ఇటలీ ప్రధాని మెలోని కూడా దీనిపై స్పందించాల్సి వచ్చింది. మహిళల కుస్తీల్లోకి ఎక్స్, వై క్రోమోజోమ్‌లు ఉన్న అథ్లెట్లను ఎలా అనుమదిస్తారని చాలామంది ప్రశ్నించారు. టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ మొత్తం 7 పతకాలు సాధించే అవకాశం ఉన్నా.. కేవలం 6 పతకాలు మాత్రమే గెలుచుకోగలిగింది. అయితే ఈ ఒలింపిక్స్‌లో భారత్ మరో 7 పతకాలు సాధించి ఉండేది. కానీ, ఈ పతకాలు తృటిలో మిస్ అయ్యాయి. గల్లంతైన ఆ 7 పతకాల వివరాలు ఎలా ఉన్నాయో ఓసారి చూద్దాం.ఈ ఒలింపిక్స్‌లో మను భాకర్ అద్భుత ప్రదర్శన చేసి 2 కాంస్య పతకాలు సాధించింది. అయితే, మను భాకర్ పతకం సాధించే అవకాశం ఉంది. ఆమె 25 మీటర్ల ఎయిర్ రైఫిల్ షూటింగ్ పోటీలో పతకం సాధించలేదు. కానీ, తృటిలో పతకం సాధించే అవకాశాన్ని కోల్పోయింది.బ్యాడ్మింటన్ క్రీడల్లో భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ సెమీఫైనల్‌కు చేరాడు. సెమీ ఫైనల్ మ్యాచ్‌లో ఓడిపోవాల్సి వచ్చింది. ఆ తర్వాత కాంస్య పతక మ్యాచ్‌లో ప్రారంభంలోనే ఆధిక్యం సాధించాడు. ఆపై తన లయను కోల్పోయాడు. 13-21, 21-16, 21-11 తేడాతో మలేషియాకు చెందిన లీ జి జియా చేతిలో ఓడిపోయాడుమహేశ్వరి చౌహాన్, అనంత్‌లకు షూటింగ్ పోటీల్లో భారత్ తరపున పతకం సాధించే అవకాశం లభించింది. కాంస్య పతక పోరులో రెండు జోడీలు చైనాకు చెందిన జియాంగ్ యుటింగ్, లియు జియాలిన్‌లతో తలపడ్డాయి. కానీ కేవలం 1 పాయింట్ తేడాతో భారత్ పతకాల ఆశలు అడియాశలయ్యాయి. చివరికి ఈ జంట నాలుగో స్థానంలో నిలిచింది.మహేశ్వరి చౌహాన్, అనంత్‌లకు షూటింగ్ పోటీల్లో భారత్ తరపున పతకం సాధించే అవకాశం లభించింది. కాంస్య పతక పోరులో రెండు జోడీలు చైనాకు చెందిన జియాంగ్ యుటింగ్, లియు జియాలిన్‌లతో తలపడ్డాయి. కానీ కేవలం 1 పాయింట్ తేడాతో భారత్ పతకాల ఆశలు అడియాశలయ్యాయి. చివరికి ఈ జంట నాలుగో స్థానంలో నిలిచిందిమిక్స్‌డ్ ఆర్చరీ టీమ్‌లో ధీరజ్ బొమ్మదేవర, అంకిత భకత్ భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. కాంస్య పతక పోరులోనూ ఈ జోడీ ఆడింది. ఈ మ్యాచ్‌లో భారత్‌కు మరో పతకం వస్తుందని అంతా భావించారు. కానీ, అమెరికాకు చెందిన కేసీ కౌఫోల్డ్, బ్రాడీ ఎలిసన్ 2-6తో ధీరజ్ బొమ్మదేవర, అంకితా భకత్ జోడీని ఓడించి పతకం సాధించాలనే భారత్ కలను నీరుగార్చారు. ఇక్కడ కూడా ఈ భారత జోడీ నాలుగో స్థానం దక్కించుకుంది.భారత షూటర్ అర్జున్ బాబుటాకు కూడా పతకం సాధించే అవకాశం వచ్చింది. అతను 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో కాంస్య పతక మ్యాచ్ ఆడాడు. అయితే, క్రొయేషియా ఆటగాడు మారిసిక్ మిరాన్ చేతిలో అర్జున్ ఓడిపోయాడు. దీంతో భారత్ మరో పతకం సాధించాలన్న కల చెదిరిపోయింది.భారత స్టార్ మహిళా అథ్లెట్ మీరాబాయి చాను నుంచి దేశంలోని కోట్లాది మంది క్రీడాభిమానులు పతకం ఆశించారు.

## సమస్యల వలయంలో గురుకులాలు.. చీమకుట్టినట్లైనా లేని ప్రభుత్వం: హరీశ్‌రావు

హైదరాబాద్: రాష్ట్రంలోని ఐటీఐ కాలేజీలు, గురుకులాల్లో కనీస వసతులు లేక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేకపోవడం దుర్మార్గమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. పెద్దపల్లి, సంగారెడ్డి, అదిలాబాద్.. ఇలా రాష్ట్రంలో ఎక్కడి ఐటీఐల పరిస్థితి చూసినా అధ్వాన్నంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. పారిశుద్ధ్య నిర్వహణ లేక, టాయిలెట్స్, అవసరమైన సిబ్బంది లేక విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. లైబ్రరీలో కంప్యూటర్లు, ఇతర యంత్రాలు, పనిముట్లు పనిచేయడం లేదన్నారు. దీంతో విద్యార్థులు ప్రాక్టికల్స్ చేయలేకపోతున్నారని వెల్లడించారు. కొన్ని చోట్ల ఐటీఐ తరగతుల్లోకి వాన నీరు చేరి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.ఇక గురుకులాల పరిస్థితి నానాటికీ దిగజారుతున్నదని



ఆగ్రహం వ్యక్తంచేశారు. కలుషిత ఆహారంతో విద్యార్థుల అస్వస్థత, పాము కాటుకు విద్యార్థి మృతి, డెంగీ జ్వరంతో విద్యార్థి దుర్మరణం వంటి వార్తలు రాష్ట్రంలో నిత్యకృత్యం అయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. అత్యధిక ప్రాంగణాలు దోమలు, ఈగలతో మురికి కూపాలుగా ఉన్నాయని తెలిపారు. స్నానాల గదులకు డోర్లు కూడా లేని పరిస్థితి నెలకొన్నదని చెప్పారు. సరిపడా బాత్‌రూంలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదని, పెడుతున్న భోజనం కూడా నాణ్యంగా ఉండటం లేదన్నారు. దిక్కులేక కారం అన్నంతో కడుపులు నింపుకుంటున్నారని చెప్పారు. వాటర్ ట్యాంకులు మురికితో పాకురు పట్టి ఉంటున్నాయని తెలిపారు. ఆ నీటినే విద్యార్థులు స్నానానికి, ఇతర అవసరాలకు వాడుతుండటంతో చర్మవ్యాధుల బారిన పడుతున్నారని వెల్లడించారు.ఇన్ని సమస్యల మధ్య విద్యార్థులు చదువుపై ఎలా దృష్టి సారిస్తారని ప్రశ్నించారు. గురుకులాల్లో చదివితే విద్యార్థుల భవిష్యత్తు బంగారుమయం అవుతుందని తల్లిదండ్రులు ఎలా నమ్ముతారని నిలదీశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రఖ్యాతిగాంచిన గురుకులాలు, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దిగజారుతుండటం శోచనీయమని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఐటీఐలు, గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, అవసరమైన అన్ని సౌకర్యాలు వెంటనే కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని ఐటిఐ కాలేజీలు, గురుకులాల్లో కనీస వసతులు లేక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేకపోవడం దుర్మార్గం.

## తెలంగాణ డెయిరీని బొంద పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర : శ్రీనివాస్ గౌడ్



హైదరాబాద్ : తెలంగాణ డెయిరీని బొంద పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత శ్రీనివాస్ గౌడ్ ధ్వజమెత్తారు. రైతులు పాడి పరిశ్రమ నుంచి వైదొలిగి, వలస కూలీలుగా వెళ్లే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టిస్తోంది అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి 15 రోజులకు ఒకసారి పాడి రైతులకు డబ్బులు చెల్లించేవాళ్లం. కాంగ్రెస్ హయాంలో నాలుగు నెలలకు ఒకసారి ఇస్తున్నారు. మరో నాలుగు నెలలు గడిచినా డబ్బులు ఇవ్వట్లేదు. డబ్బులు ఇవ్వకపోతే పాడి రైతు ఎలా బతుకుతాడు..? దాణా ఎక్కడ్నుంచి తెస్తాడు..? పాల ఉత్పత్తి ఎలా సాధ్యమవుతుంది.? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని శ్రీనివాన్ గౌడ్ నిలదీశారు.రాష్ట్రంలో పాలకు బాగా డిమాండ్ ఉంది. ఒక్క హైదరాబాద్‌లోనే 30 లక్షల లీటర్లు అవసరం. 5 లక్షల లీటర్లు కూడా సేకరించలేకపోతున్నారు. ఈ 5 లక్షల లీటర్లలో 50 శాతం కేవలం మహబూబ్‌నగర్ జిల్లా నుంచే వస్తున్నాయి. మిగతా 25 లక్షల లీటర్ల పాలు ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ డైయిరీని మూసేయాలని కుట్ర జరుగుతోంది. ఏపీ డెయిరీని ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తుంది. గుంటూరు, విజయవాడ నుంచి పాలు వస్తున్నాయి. అవి కల్తీవో.. మంచివో తెలియని పరిస్థితి ఉంది. యూరియాతో పాలు తయారు చేస్తున్నట్లు గతంలో వార్తలు వచ్చాయని శ్రీనివాస్ గౌడ్ గుర్తు చేశారు.కల్తీ పాలతో క్యాన్సర్ వస్తుందని డాక్టర్లే చెబుతున్నారు. కల్తీ పాలు తెచ్చి హైదరాబాద్‌లో తాగిస్తున్నారు. దీంతో ప్రాణాలు పోతాయి. విషపూరితమైన పాలు తాపేందుకు ఇతర డెయిరీలను ప్రోత్సహిస్తున్నారు. తెలంగాణ డెయిరీని బొందపెట్టి ఆంధ్రా డెయిరీని పైకి లేపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందువల్లే తెలంగాణ డెయిరీకి ప్రోత్సహకాలు ఇవ్వడం లేదు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ డెయిరీని కాపాడుకున్నాం. సకాలంలో దాణా ఇచ్చాం. సబ్సిడీ మీద బర్రెలు, ఆవులను ఇచ్చారం. ఇప్పుడు సబ్సిడీ, దాణా పోయింది. పాలు పోసిన రైతులకు పైసలు ఇవ్వట్లేదు. నెయ్యిని మురగబెడుతున్నారు. యాదాద్రికి, తిరుపతికి, వేములవాడకు ఇవ్వొచ్చు కదా.. ఈ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేస్తోంది అని శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు.

## చెల్లిపై భార్యను పోటీకి దింపి తప్పు చేశా : అజిత్ పవార్

న్యూఢిల్లీ: మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవలే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బారామతి స్థానం నుంచి సోదరి సుప్రియా సూలే పై తన భార్య సునేత్ర పవార్‌ను ప్రత్యర్థిగా నిలబెట్టి తప్పు చేశానని వ్యాఖ్యానించారు. రాజకీయాలను ఇంటి వ్యవహారాల్లోకి రానివ్వకూడదన్నారు.త్వరలో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అజిత్ పవార్ రాష్ట్రవ్యాప్తంగా 'జన సమ్మాన్ యాత్ర' నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఓ న్యూస్ ఛానెల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికల్లో వదినా మరదళ్ల పోటీ అంశాన్ని ప్రస్తావించారు. తనకు తన సోదరీమణులంటే ఎంతో ఇష్టమని చెప్పారు. ఇంటి వ్యవహారాల్లోకి రాజకీయాలను రానివ్వకూడదని వ్యాఖ్యానించారు. ఇటీవలే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో సోదరి సుప్రియా సూలేపై తన భార్య సునేత్రను పోటీకి దింపి తప్పు చేశానన్నారు. ఇలా జరిగి ఉండకూడదని.. ఎన్సీపీ పార్లమెంటరీ బోర్డు నిర్ణయం కారణంగా ఇలా చేయాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు.ఈ ఇంటర్వ్యూలో భాగంగా వచ్చే వారం రక్షాబంధన్ సందర్భంగా సోదరి సుప్రియా సూలేను కలుస్తారా..? అని విలేకరులు అజిత్ పవార్‌ను ప్రశ్నించారు. అయితే, ప్రస్తుతం ఆమె వేరే పర్యటనలో ఉందని డిప్యూటీ సీఎం సమాధానమిచ్చారు. ఒకేచోట ఉంటే తప్పకుండా కలుస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ పై మహారాష్ట్ర నేతలు విమర్శలు చేయడంపై కూడా అజిత్ పవార్ స్పందించారు. ఆయన సీనియర్ నేత మాత్రమే కాదని అన్నారు. తమ కుటుంబ పెద్ద అని చెప్పారు. ఆయనపై బీజేపీ, శివసేన, ఎన్సీపీ నేతలు విమర్శలు చేయడం సరికాదన్నారు.'రైతులు, మహిళలు, యువత, అభివృద్ధి, సంక్షేమ పథకాలపైనే నేను మాట్లాడాలనుకుంటున్నాను. నాపై వచ్చే విమర్శలకు స్పందించకూడదని నిర్ణయించుకున్నా. శరద్ పవార్ పార్టీ సీనియర్ నాయకుడేకాదు.. మా కుటుంబ పెద్ద. ఆయన నాపై చేసిన విమర్శల గురించి నేను మాట్లాడాలనుకోవట్లేదు. అయితే అధికార బీజేపీ, శివసేన శరద్ పవార్‌ను లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేయడం సరికాదు. ఈ విషయంలో కూటమి నేతలు కలిసి కూర్చున్నప్పుడు నా అభిప్రాయాన్ని తెలియజేస్తాను' అని అజిత్ పవార్ పేర్కొన్నారు.కాగా, శరద్ పవార్ సోదరుడి కుమారుడు అజిత్ పవార్ ఎన్సీపీని చీల్చి బీజేపీతో చేతులు కలిపిన విషయం తెలిసిందే. ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వంలో చేరారు. దీంతో పవార్ కుటుంబంలో చీలికలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవలే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అజిత్ పవార్ తన భార్య సునేత్ర పవార్‌ను బారామతి నుంచి సోదరి సుప్రియా సూలేపై బరిలోకి దింపారు. ఈ క్రమంలో వదిన మరదలి మధ్య పోరుపై నియోజకవర్గంలో తీవ్ర స్థాయిలో చర్చ నడిచింది. ఇక ఆ ఎన్నికల్లో సుప్రియా సూలేనే గెలుపొందారు. తన వదినపై ఏకంగా 1.55 లక్షలకు పైగా ఓట్ల మెజారిటీతో తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఈ ఎన్నికల్లో సుప్రియా సూలేకి 7,32,312 ఓట్లు పోలవగా.. సునేత్రకు 5,73,979 ఓట్లు వచ్చాయి.

## టెలిగ్రాఫ్ దినపత్రిక ఎడిటర్‌గా బ్రిటన్ మాజీ ప్రధాని !



లండన్: బ్రిటన్‌కు చెందిన టెలిగ్రాఫ్ దినపత్రికకు.. ఎడిటర్‌గా ఆ దేశ మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్ బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నాయి. ఆ దేశానికి చెందిన మీడియా సంస్థలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం టెలిగ్రాఫ్ దినపత్రిక గడ్డురోజులను గడుపుతున్నది. అయితే ఆ పత్రికను నధీమ్ జాహవి కొనుగోలు చేస్తారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్.. నధీమ్ జాహవితో ఎడిటర్ పోస్టు గురించి చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. టెలిగ్రాఫ్ న్యూస్‌పేపర్‌లో ఓ సీనియర్ పాత్రను పోషించేందుకు బోరిస్ ఆసక్తిగా ఉన్నట్లు స్కై న్యూస్ ఓ కథనాన్ని రాసింది. అయితే దీనిపై ఇంకా అగ్రిమెంట్ జరగలేదు.జాహవితో జాన్సన్ సంప్రదింపులు జరిపినట్లు టెలిగ్రాఫ్ సంస్థ తెలిపింది. సుమారు 20 ఏళ్ల పాటు బార్క్‌లే ఫ్యామిలీ టెలిగ్రాఫ్ పత్రిను నడిపింది. అయితే ప్రస్తుతం ఆ సంస్థ బాకీలు చెల్లించలేకపోతున్నది. దీంతో ఆ మీడియా ఔట్‌లెట్‌ను వేలానికి పెట్టారు. చాలా మంది కోటీశ్వరులు ఆ పత్రికను కొనుగోలు చేసేందుకు ఆసక్తి ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. ఎడిటర్ పోస్టు విషయంలో మాత్రం జాన్సన్ ప్రతినిధి ఎటువంటి వివరణ ఇవ్వలేదు.

## బెయిల్‌ను తిరస్కరించడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే..! సుప్రీంకోర్టు వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: చట్టవ్యతిరేక కార్యకలాపాలు.. తదితర ప్రత్యేక చట్టాల కింద జరిగే నేరాలకు బెయిల్ నియమం వర్తిస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది. న్యాయస్థానాలు తగిన కేసుల్లోనూ బెయిల్‌ను తిరస్కరించడం ప్రారంభిస్తే అది ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమే అవుతుందని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం పేర్కొంది. ప్రాసిక్యూషన్ ఆరోపణలు చాలా తీవ్రమైనవి అయినా.. బెయిల్ కేసును చట్టం ప్రకారం పరిగణించడం కోర్టు విధి అని పేర్కొంది. బెయిల్ అనేది నియమమని.. జైలు నుంచి మినహాయింపు అని తెలిపింది. ఇది ప్రత్యేక చట్టాలకు సైతం వర్తిస్తుందని చెప్పింది. న్యాయస్థానాలు బెయిల్ నిరాకరించడం ప్రారంభిస్తే రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద ఇచ్చిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినట్టేనని ధర్మాసనం అభిప్రాయపడింది.జలాలుద్దీన్ ఖాన్ అనే వ్యక్తిని బెయిల్‌పై విడుదల చేసేందుకు కోర్టు అంగీకరించింది. జలాలుద్దీన్ ఖాన్‌పై ఉపా యాక్ట్‌లో పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. అతను నిషేధి సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (ఖఈఎ) సభ్యులకు తన ఇంటిపై అంతస్తును అద్దెకు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిందితుడు నేరపూరిత కుట్ర, ఉగ్రవాదం, హింసాత్మక చర్యలకు పాల్పడేందుకు పన్నిన కుట్రలో భాగమయ్యాడని ఎన్ఐఏ ఆరోపించింది. నిందితులు ఫుల్వారీ షరీఫ్ (పాట్నా)లోని అహ్మద్ ప్యాలెస్‌ను అద్దెకు తీసుకొని వసతి ఏర్పాటు చేసుకున్నారని.. భవనాన్ని హింసాత్మక చర్యలకు, సమావేశాలను నిర్వహించేందుకు, శిక్షణ ఇచ్చేందుకు ఉపయోగించినట్లుగా ఆరోపణలున్నాయి. 2022లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీహార్ పర్యటన సందర్భంగా అలజడి సృష్టించేందుకు నిందితులు కుట్ర పన్నినట్లుగా బిహార్ పోలీసులకు సమాచారం అందింది. ఆ తర్వాత 11 జులై 2022న పోలీసులు నిందితులను అరెస్టు చేశారు.

## రామ్ దేవ్ బాబాకు భారీ ఊరట.. ధిక్కరణ కేసును ముగించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: యోగా గురు రామ్‌దేవ్ బాబా కు భారీ ఊరట లభించింది. తప్పుదోవ పట్టించే ప్రకటనలను రూపొందించారని పతంజలి ఆయుర్వేద్ ఎండీ ఆచార్య బాలకృష్ణ యోగా గురు బాబా రామ్‌దేవ్‌లపై నమోదైన ధిక్కరణ కేసును సుప్రీంకోర్టు మూసివేసింది. ఈ ప్రకటనలకు సంబంధించి రామ్ దేవ్ బాబా, ఎండీ ఆచార్య బాలకృష్ణ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పిన విషయం తెలిసిందే. ఇకపై అలాంటి యాడ్స్ ఇవ్వబోమని కోర్టుకు విన్నవించారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న సుప్రీం ధర్మాసనం.. వారిపై ధిక్కరణ కేసును మూసివేసింది.కొవిడ్ వ్యాక్సినేషన్, అల్లోపతికి వ్యతిరేకంగా పతంజలి ప్రచారం చేసిందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆరోపించింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. దీనిపై జస్టిస్ హిమా కోహ్లీ, అమానుల్లాతో కూడిన ధర్మాసనం విచారణ జరుపుతోంది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా పంతజలిపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అయితే, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, ఆరోపించిన తప్పుదోవ పట్టించే ప్రకటనలను పతంజలి ప్రింట్ మీడియాలో ప్రచురించింది. జనవరి 3, 2024న జరిగిన విచారణలో పతంజలిపై ధిక్కార చర్య తీసుకున్నందుకు బాబా రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.ధిక్కార నోటీసులు జారీ చేసినా స్పందన లేకపోవడంతో.. ఇద్దరిని వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది. బాబా రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణ క్షమాపణలు కోరారు. ఆ క్షమాపణలను కోర్టు తిరస్కరించింది. తప్పుడు ప్రకటనలపై క్షమాపణలు కోరుతూ పత్రికల్లో యాడ్స్ ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. మళ్లీ 7న విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం పతంజలిని మందలించింది. ఆ తర్వాత విచారణలో బాబా రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణలకు వ్యక్తిగత హాజరు నుంచి సర్వోన్నత న్యాయస్థానం మినహాయింపును ఇచ్చింది.

# ఆర్ జి ఎస్ ఏ ప్రణాళిక తయారీపై సర్పంచులు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

**వివిధ అంశాలను వివరించిన ఎంపీడీవో,ఈవో ఆర్ డి**



ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 13 విభారె న్యూస్ :- పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆర్ జి ఎస్ ఏ కార్యాచరణ ప్రణాళిక 2024 -25 పై మండలంలోని సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం రెండవ రోజు కొనసాగింది ఈ సందర్భంగా ఎంపీడీవో మహబూబ్ ఖాన్,ఈవోఆర్డి తహేర్ హుస్సేన్లు మాట్లాడుతూ శానిటేషన్, సాలిడ్, వేస్ట్ మేనేజ్మెంట్ జిపిడిపి,స్కూటీని గ్రామపంచాయతీ పరిపాలన ఇతర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూఆళ్లగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు సంపద సృష్టిపై మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు గ్రామాలలో రైతులు వర్మీ కంపోస్టు ఏర్పాటు చేసుకొని సహజ సిద్ధంగా వర్మీ కంపోస్ట్ ను తయారు చేసే విధానంపై మెలకువలను ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. గ్రామాలలో ముఖ్యంగా నాలుగు విషయాలపై సర్పంచులు గ్రామ కార్యదర్శులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. స్ట్రీట్ లైట్లు, పారిశుద్ధ్యం, షెడ్ల నిర్వహణ, వర్మి కంపోస్టు తయారీపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సర్పంచులు అందరూ విధిగా పాల్గొన్నారు. శిక్షణ వివరాలు ట్రైనింగ్ మేనేజ్మెంట్ పోస్టర్లో నమోదు చేయాలని డిజిటల్ అసిస్టెంట్లను ఆదేశించారు 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం ఘన వ్యర్థాల నిర్వహణ రికార్డుల నిర్వహణ వంటి అంశాలను వివరించామన్నారు.

## పత్రికా స్వేచ్ఛను కాపాడాలి: ఏపీయూడబ్ల్యూజే ఎస్పీకి వినతిపత్రం




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 13- ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ ప్రభుత్వ ఆస్తులను ప్రజా స్వేచ్ఛను నిశితంగా పరిశీలించి వాస్తవాలను ప్రచురించే పత్రికా విలేకరులపై స్వార్థంతో ఇచ్చే ఫిర్యాదులను నిశితంగా పరిశీలించి వాస్తవాన్ని ప్రచురించిన బనగానపల్లె తెలుగు వార్తా పత్రిక విలేకరి, ఏపీడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు రామదాసు రెడ్డి, అతని కుమారుడు గౌరీశంకర్ పై అక్రమంగా బనాయించిన కేసును ఎత్తివేయాలని ఏపీడబ్ల్యూజే నంద్యాల జిల్లా కార్యవర్గం మంగళవారం జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణాకు వినతిపత్రం సమర్పించారు . అధికారులు తెలిపిన వివరాలను మాత్రమే ప్రచురించారు. ఇప్పటికైనా పత్రిక విలేకరులపై చేసే ఫిర్యాదులను నిశితంగా పరిశీలించి నిజా నిజాలను నిర్ధారణ చేసిన తర్వాత తదుపరి చర్యలు చేపట్టాలని కోరినట్లు వారు తెలిపారు. బనగానపల్లెలో వార్తా విలేకరిపై నమోదైన కేసు విషయం పట్ల క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టేందుకు జిల్లా ఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

## 78 వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు

### తప్పక రండి కమిషనర్ నిరంజన్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 13 : దేశం మనదే.. తేజం మనదే.. ఎగురుతున్న జెండా మనదే.. దేశం తర్వాతే ఏదైనా అని, ప్రతి ఒక్కరూ జాతీయ భావానికి విలువ ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 15 వ తేదీన ఉదయం మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా వందనం ఉంటుందన్నారు . కావున ప్రజాప్రతినిధులు. అధికారులు. మున్సిపల్ సిబ్బంది. సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

## తహసిల్దార్ మల్లికార్జునరావును మర్యాద పూర్వకంగా కలిసిన టిడిపి నాయకులు

**తాసిల్దార్ ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు**



ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 13 విభారె న్యూస్ :- రుద్రవరం మండలం తాసిల్దార్ గా బాధ్యతలు చేపట్టిన మల్లికార్జునరావును టీ లింగం దిన్నె గ్రామానికి చెందిన టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం టిడిపి నాయకులు మిసాల చిన్నకృష్ణ, గాలి పోతుల వెంకటేశ్వర్లు, సాంబ, తాసిల్దార్ కార్యాలయంలో ఆయనను కలిసి శాలువ పూలమాలతో సన్మానించి పూలబోకెను అందజేశారు.

## ఆళ్లగడ్డ ఎల్ఐసి కార్యాలయంలో సిడబ్ల్యుఏ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 13 విభారె న్యూస్ :- ఆళ్లగడ్డ పట్టణంలోని జీవిత బీమా సంస్థ కార్యాలయంలో మంగళవారం క్లియా వెల్ఫేర్ అసోసియేషన్ (అచిం)13 వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ బ్రాంచ్ మేనేజర్ బీవీఎస్ఎల్ శ్రీనివాసులు చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్లకు వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎల్ఐసి సంస్థలో క్లియా ఛానల్ ఏర్పడిన తర్వాత చక్కని వ్యాపారం ప్రగతి సాధిస్తున్నారని మేనేజర్ కొనియాడారు. ఎల్ఐసి సంస్థ ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఇచ్చే లక్ష్యాలలో క్లియా ఛానల్ ద్వారా 25 నుండి 30 శాతం పాలసీలు,ప్రీమియం సేకరిస్తున్న ట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్లు కే. నాగభూషణం శెట్టి, రామకృష్ణుడు,కాసింవలి, సత్యనారాయణ, శ్రీనివాసులు, బ్రాంచ్ పరిపాలన అధికారులు సుబ్బారెడ్డి, సురేంద్రనాథ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

## గోనెగండ్ల మండలంలో జిల్లా ఎస్పీ పర్యటన...



కర్నూలు జిల్లా ప్రతినిధి ఆగష్టు 13 విభారె న్యూస్..గోనెగండ్ల మండలం, కున్నూరు గ్రామంలో పర్యటించిన కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ప్రజల సమస్యల పై సత్వరమే స్పందిస్తాం.సమస్యలుంటే తెలియజేయండి. గోనెగండ్ల మండలం లోని ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామమైన కున్నూరు గ్రామంలో కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ మంగళవారం పర్యటించారు. జిల్లా ఎస్పీ కున్నూరు గ్రామ ప్రజలతో మాట్లాడారు. గ్రామ ప్రజలందరూ కలిసి మెలిసి ఉండాలన్నారు. ఎటువంటి గొడవలు చేసుకోవద్దన్నారు. గ్రామ ప్రజల సమస్యలు ఎమైనా ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పికెట్ లో ఉన్న పోలీస్ సిబ్బంది తో మాట్లాడారు. పోలీసులు ప్రజలతో మమేకమై మంచి సత్సంబంధాలు కలిగి ఉండాలని తెలిపారు. పికెట్ పాయింట్ రిజిస్టర్ ను తనిఖీ చేసి, సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ సిఐ నాగరాజ్ యాదవ్, గోనెగండ్ల సీఐ ఎ.గంగాధర్ పాల్గొన్నారు.

## శ్రీ నరసింహా ఈరన్న స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు వివరాలు..



కౌతాళం ఆగష్టు 13 విభారే న్యూస్.. డిప్యూటీ కమిషనర్ కార్యనిర్వహణాధికారి పట్టెనీ గురుప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థానం, ఉరుకుంద 2024 శ్రావణమాసం ఉత్సవాలు సందర్భముగా మంగళవారం అనగా తేదీ. 13-8-2024న హుండీ లెక్కింపు కార్యక్రమం జరపడమైనది ఇందులో నగదు రూపంలో రూ. 1,07,72,969/-లు,బంగారం: 52 గ్రాములు,వెండి: 19 కేజీల 700 గ్రాములు వచ్చినది. విదేశీ కరెన్సీ ఆస్ట్రేలియా 50 డాలర్లు, అమెరికా 184 డాలర్లు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ చీఫ్ ఫెస్టివల్ అధికారి పాండురంగా రెడ్డి,హుండీ పర్యవేక్షణ అధికారి బి.సుధాకర్ రెడ్డి,జిల్లా దేవాదాయశాఖ అధికారి కర్నూల్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఉరుకుంద సిబ్బంది, దేవస్థాన పర్యవేక్షకులు, ఇతర సిబ్బంది, కౌతాళం పోలీస్ సిబ్బంది,గ్రామ పెద్దలు, శ్రీ భ్రమరాంబ సేవసమితి ఆదోని వారు పాల్గొనియున్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి....








విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూలై 12 పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని, మొక్కలు నాటడం వల్ల భావితరాలకు మేలు జరుగుతుందని వెల్దుర్తి సీఐ మధుసూదన్ రావు తెలిపారు. డోన్ పట్టణానికి చెందిన స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో వెల్దుర్తి నందు గల అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల నందు ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంకి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ స్ఫూర్తి సభ్యులతో, జనవిజ్ఞాన వేదిక సభ్యులతో, పాఠశాల సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ మొక్కలు నాటే కార్యక్రమంకి సహకారం అందించిన నంద్యాలకి చెందిన న్యాయవాది వాసగిరి క్రిష్ణలింగయ్య, సుమలత దంపతులను సీఐ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసూన, పాఠశాల సిబ్బంది, స్ఫూర్తి సభ్యులు మధు, మోహన్ రెడ్డి, నారాయణ స్వామి, జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి బలిజ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు

## ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లండి....



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూలై 12 కేంద్ర కార్యాలయం మంగళగిరి ఆఫీస్ లో వినతిపత్రాలను స్వికారిస్తున్న ప్రభాకర్ చౌదరి ని నంద్యాల జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల మల్లికార్జున కలవడంజరిగింది .రాష్ట్రంలోని గత వైసీపీ పార్టీలో జరిగిన అక్రమాలకు పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లలని కోరారు బీసీసెల్ అధికార ప్రతినిధి ధనుంజయా, కల్లూరు మండలం మాజీ ఎంపీపీ మదేశ్ , ఉలిందకొండ మండల సీనియర్ నాయకులు ఇ.వి రమణ , యువనాయకులు ప్రసాద్ గౌడ్ , రాజ్ కుమార్. పాల్గొని బీసీ సామాజిక వర్గానికి న్యాయం కోరారు

# త్వరలో రెవెన్యూ సదస్సుల నిర్వహణ

**భూ సమస్యలను పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు**

**జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**



కర్నూలు, ఆగస్టు 13:- రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు త్వరలో రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో రెవెన్యూ సదస్సుల నిర్వహణపై ప్రజా ప్రతి ఐదుకు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 16 వ తేది నుండి రెవెన్యూ సదస్సుల కార్యక్రమం జరగాల్సి ఉందని, అయితే సాధారణ బదిలీలు ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని త్వరలోనే నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పటికే రెవెన్యూ సదస్సుల నిర్వహణకు షెడ్యూల్ రూపొందించడం జరిగిందని, ప్రభుత్వం నుండి రివైజ్డ్ తేదీలు రాగానే, షెడ్యూల్ లో తేదీలు మాత్రమే మార్పు చేయవలసి ఉంటుందన్నారు. సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ముఖ్యంగా భూ వివాద సమస్యల పై 70 నుండి 80 శాతం అర్జీలు ప్రజల నుండి వస్తున్నాయని, వాటి కోసం ఇంత దూరం రాకుండా ఈ సదస్సుల వల్ల వీటిని గ్రామాల్లోనే పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు.. తహసీల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, వీఆర్వో, నోడల్ అధికారి, దేవదాయ శాఖ అధికారి, రిజిస్ట్రేషన్, అటవీ, సర్వేయర్, వక్ఫ్ బోర్డ్ అధికారులనీదరూ కలిసి ఒక టీంగా ఏర్పడి ఒక గ్రామానికి సంబంధించిన రికార్డ్స్ తీసుకొని సంబంధిత గ్రామా నికి వెళ్లి ప్రజల నుండి అర్జీలను తీసుకుంటారని, అవసరమనుకుంటే ఫీల్డ్ లో వెరిఫై చేసి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం రెవెన్యూ సదస్సుల కార్యక్రమము యొక్క ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ పేర్కొన్నారు. టీమ్ లను సూపర్వైజ్ చేసేందుకు జిల్లా నుండి ఒక సీనియర్ అధికారిని మండల నోడల్ ఆఫీసర్ గా నియమించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు..రెవెన్యూ సదస్సుల కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ కోఆర్డినేటర్ గా ఉంటారన్నారు.. షెడ్యూల్ ఫైనల్ అయిన తర్వాత ప్రజా ప్రతినిధులకు, రైతు సంఘాలకు, టీమ్ లకు అందచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.. పబ్లిసిటీలో భాగంగా రెవెన్యూ సదస్సుల వివరాలతో కరపత్రాలను తెలుగులో తయారుచేసి, సదస్సు నిర్వహణకు రెండు రోజులు ముందుగానే ఆయా గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేయడంతో పాటు టామ్ టామ్ ద్వారా ప్రజలకు తెలియచేయాలని సబ్ కలెక్టర్, ఆర్డీఓ లను కలెక్టర్ ఆదేశించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190